క్లుప్తంగా

సాహితీ రంగ అభివృద్ధికి కృషి



సాహితీవేత్తలను సత్కరిస్తున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం సాహిత్యానికి పెద్దపీట వేస్తుందని బీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేనెంబర్ చౌరస్తాలో సాహితీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలను సత్కరించారు. అనంతరం ఎడ్ల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ సమ ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, మాజీ కార్పొరేటర్ పులి జగన్, నాయకులు నాగేష్ గౌడ్ విజితారెడ్డి, జీవన్‌గౌడ్, కె.రాము, అనిల్ యాదవ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష



అంబేడ్కర్ కళాశాల కేంద్రం బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కళాశాలల్లో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 పరీక్ష ప్రశాంతం ముగిసింది. ఈ సందర్భంగా చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని అరోరా కళాశాల సెంటర్‌లో 480 అభ్యర్థులకు గాను 244 మంది హాజరు కాగా, 236 మంది గైర్హాజరయ్యారు. అరోరా కళాశాల–బీలో 234 మంది, బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ కళాశాలలో 142 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు సీఐ వివరించారు. కాగా ఏవీ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 546 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

నేడు 5కే 'తెలంగాణ రన్'

చైతన్యపురి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ పీ అండ్ టీ కాలనీ చౌరస్తా నుంచి ఎల్‌బీనగర్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వరకు సోమవారం 5కే తెలంగాణ రన్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 5.30 గంటలకు నిర్వహించే 5కే రన్‌లో ముఖ్యఅతిథులుగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ పాల్గొంటారని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ చింతల అరుణ

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధిలోని శ్రీనివాసానగర్ కాలనీ (విశాలాంధ్రకాలనీ)కమ్యూనిటీహాల్‌లో సుప్రజ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరాలను కాలనీ వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రి మేనేజర్ సతీష్, ఇన్‌చార్జి వినయ్‌కుమార్, కాలనీవాసులు వినోద్‌రెడ్డి, థామస్‌చౌదరి, జనార్దన్‌రెడ్డి, సరోత్తంరెడ్డి, జైపాల్ రెడ్డి, అశోక్‌యాదవ్, యాదయ్య పాల్గొన్నారు.

ముగిసిన మ్యాజిక్ షో

రాంగోపాల్‌పేట్: మెజీషియన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు నిర్వహించిన ఛూమంతర్ మ్యాజిక్ షో ఆదివారంతో ముగిసింది. ఈ నెల 10వ తేదీన మెజీషియన్స్ అకాడమీ చైర్మన్ సామల వేణు ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో నిర్వహించిన ఈ మ్యాజిక్ షోలో 11 దేశాలకు చెందిన మెజీషియన్లు హాజరై తమ ఇంద్రజాలంతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు జడ్జి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీవీ పట్టాభిరాంతో పాటు అంతర్జాతీయ మెజీషియన్లు పాల్గొన్నారు.



ఎప్పుడైనా..ఎక్కడైనా..

- బీఆర్‌ఎస్ నేతలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్

అంబర్‌పేట అభివృద్ధిపై చర్చకు సిద్ధం



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించేందుకు తాను ఎప్పుడైనా..ఎక్కడైనా సిద్ధమేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గతంలో అంబర్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానన్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు అవగాహన రాహిత్యంతో అభివృద్ధిపై సవాళ్లు విసురుతున్నారని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు. ఆదివారం చే నెంబర్ చౌరస్తాలో అంబర్‌పేట నియోజకవర్గం మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా పార్టీ మోర్చాల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.... అంబర్‌పేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానన్నారు. నియోజకవర్గంలో 90 కమ్యూనిటీ హాళ్లు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, శాశ్వత ప్రాతిపాదికన మంచినీటి పైప్‌లైన్లను ఏర్పాటు చేశానన్నారు. పార్కులు, రోడ్లు, వీరన్నగుట్ట, నల్లకుంటలో జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం పథకం కింద పేదలకు ఇళ్లు కట్టించానన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎక్కడ ఇళ్లు కట్టించారో బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు చెప్పాలన్నారు. నియోజకవర్గంలో కామూగార్‌నగర్‌లో మంత్రి కేటీఆర్ ఇళ్లు కట్టిస్తానంటే బీజేపీ అడ్డుకుందని దుష్ప్రచారం చేశారని, చిత్తశుద్ధి ఉంటే తాము ఎందుకు అడ్డుకుంటామని ఆయన ప్రశ్నించారు. అంబర్‌పేట ఫ్లై ఓవర్ కోసం తాను అన్నివిధాల సహకరించానని, రాష్ట్ర ప్రభుత్వం కొంతమందికి నష్టపరిహారం చెల్లింపులో జాప్యం చేస్తుందని ఆరోపించారు. అభివృద్ధిపై తాను రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినా కనీస స్పందన లేదని, తనపై, కేంద్ర ప్రభుత్వంపై చౌకబారు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధిపై ఎక్కడైనా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కుటుంబ పాలన, అవినీతి పాలనపై ప్రజల్లో చైతన్యం తేవాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీకి అనుబంధ విభాగాలైన ఆయా మోర్చాలే వెన్నుముకని, రాబోయే ఎన్నికల్లో క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, గద్వాల జిల్లా ఇన్‌ఛార్జ్ బి.వెంకట్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్యామ్‌రాజ్, కార్పొరేటర్లు బి.పద్మా వెంకట్‌రెడ్డి, కన్నె ఉమారమేష్ యాదవ్, అమృత, నాయకులు నాగభూషణం చారి, రవీందర్ గౌడ్, సంతోష్, చుక్క జగన్, జైకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



భావసార్ క్షత్రియ భవన్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న మంత్రి తలసాని

కాచిగూడ: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన కాచిగూడలోని భావసార్ భవన్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. భవసార్ క్షత్రియ సంఘానికి కోకాపేటలో అర ఎకరం భూమి, భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గతంలో నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన కిషన్ రెడ్డి అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి 4 సంవత్సరాలు దాటినా స్థానిక ప్రజల సమస్యలు, అభివృద్ధిని విస్మరించారన్నారు. ఓటేసి గెలిపించిన ప్రజలకు కనీసం అందుబాటులో కూడా ఉండరని ఆరోపించారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ అభివృద్ధి కోసం పని చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీధర్ లోకండే, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

కవాడిగూడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి దేశానికి, రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఇందు కోసం తల్లిదండ్రులు చేయూతనందించాలన్నారు. ఆదివారం ఇందిరా పార్క్‌లో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా శిక్షణ పొందిన కరాటే విద్యార్థులకు ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఇందిరాపార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎ.సుధాకర్ యాదవ్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతీ యువకులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. విద్యార్థులు చిన్న నాటి నుంచే చదువుతో పాటు క్రీడలు, కరాటే తదితర పోటీల్లో రాణించేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: దివ్యాంగులకు ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌ను రూ.4116కు పెంచి ప్రభుత్వం వారికి అండగా నిలిచిందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల పక్షపాతి అని మరోసారి రుజువు చేసుకున్నారన్నారు. ఆదివారం ముషీరాబాద్ చౌరస్తాలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో దివ్యాంగులకు పెన్షన్ మొత్తాన్ని పెంచినందుకు గాను సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. వారు అడక్కముందే రూ.4116కు పింఛన్ పెంచి వారికి అండగా నిలిచారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ వారికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ముషీరాబాద్ దివ్యాంగుల సంఘం నాయకులు జగన్, మహేష్, యాదగిరిలను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, మైనార్టీ కమిటి అధ్యక్షుడు మక్బుల్, డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్, సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, మీడియాసెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షులు బల్లా ప్రశాంత్, మహంకాళి దేవాలయ కమిటి చైర్మన్ ఎయిర్‌టెల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

'బీసీలపై వివక్ష తగదు'

కవాడిగూడ: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీల అభివృద్ధి పట్ల వివక్ష చూపడం తగదని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు నారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం దోమలగూడలో విలేకరులతో మాట్లాడుతూ బీసీలు ఆర్థికంగా ఎదిగేందుకు రూ.లక్ష మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం అభినందనీయం అన్నారు. అయితే బీసీల్లో 126 కులాలు ఉండగా, కేవలం 26 బీసీ కులాలకే ఈ నిబంధలు వర్తించడం దారుణమన్నారు. బీసీలకు ఇచ్చే రూ. లక్షలో ఎమ్మెల్యేలు తమ ఖాతాల్లో రూ.40 వేలు జమ చేస్తేనే నిధులు మంజూరు చేస్తామని హుకుం జారీ చేస్తున్నారని ఆరోపించారు. దళిత బంధులో అవినీతి జరిగిందని స్వయంగా ముఖ్యమంత్రే చెప్పినా బాధ్యులపై నేటికీ చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 126 కులాల బీసీ పేద కుటుంబాలకు రూ.లక్ష మంజూరు చేయాలని కోరారు. లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో బీసీలు బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

మహిళలకు సాధ్యం కానిది లేదు



బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు తదితరులను సత్కరిస్తున్న మహిళలు

కాచిగూడ: మహిళలు తలుచుకుంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. శిల్పారామంలో నిర్వహించిన ప్రదర్శనలో వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు 100 స్టాళ్లలో ఏర్పాటు చేసిన ఉత్పత్తులు ప్రత్యేకతను చాటాయన్నారు. జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం శుభ పరిణామం అన్నారు. ఈ సందర్భంగా వారిని సావిత్రిబాయి పూలే మహిళా సంఘం అధ్యక్షురాలు బెల్లం మాధవి తదితరులు సత్కరించారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నానాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం యాకుత్‌పురా రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని మహిళ (35) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పద్మశాలీలు ఐక్యంగా రాణించాలి

ఉప్పల్: ఉప్పల్ చిలుకానగర్ పద్మశాలి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం ఈస్ట్ కళ్యాణపురి కమ్యూనిటీ హాల్‌లో అడహక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు మసన చిన్నప్ప, యాదాద్రి భువనగిరి జిల్లా పీఓపీఏ అధ్యక్షుడు వనం శాంతి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలీల ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పద్మశాలీలు రాజకీయ, ఆర్థిక రంగాల్లో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో అడహక్ కమిటీ సభ్యులు ఆడేపు అంజయ్య, దేవసాని బాలచందర్, గౌడ శ్రీశైలం, సకినాల ప్రసాద్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన



చిన్నారులతో ఈశ్వరయ్య, మధుబాబు, రంజని రాగ

చిక్కడపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభ కళావెంకట దీక్షితులు హాల్‌లో ఆదివారం రాగ ఫైనార్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనాన్ని, తెలంగాణ ఖ్యాతిని ప్రతిబింబించేలా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చక్రవర్తి, రంజని రాగ తెలంగాణ ఖ్యాతి వివరిస్తూ పాటలు పాడారు. చిన్నారులు పార్థవి, కీర్తన, గీతిక, మాళవిక చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి.. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈశ్వరయ్య చిన్నారులను అభినందించారు.

ఆరోగ్య బీమాపై కార్మికులకు అవగాహన



కాచిగూడ: మాదిగ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో భవన నిర్మాణ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రమాద బీమా, ఆరోగ్య బీమా పట్ల ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమితి అధ్యక్షుడు గుండె రమేష్ చంద్ర మాట్లాడుతూ బీమా సౌకర్యం లేని భవన నిర్మాణ కార్మికులను ఎంపిక చేసి వారికి సమితి స్వయంగా ఇన్సూరెన్స్ చెల్లిస్తుందని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డప్పు మేరి కుమారి, కాసయ్య, యాదాస్, జగన్, ముడారి శ్రీనివాస్, యడవల్లి యాదయ్య మాదిగ, నిమ్మల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక వసతులతో వడ్డెర భవన్ నిర్మాణం



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ సత్యనారాయణ రాజు తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరలకు ఉప్పల్ భగాయత్‌లో ఎకరం స్థలం, రూ. కోటి నిధులు మంజూరు చేయడం అభినందనీయమని వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జె.సత్యనారాయణరాజు అన్నారు. ఈ నిధులతో అత్యాధునిక వడ్డెర ఆత్మగౌరవ భవనం నిర్మిస్తామన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ ఆధ్వర్యంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు మాట్లాడుతూ చైర్మన్‌గా తనను నియమించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించి, నిరుపేద వడ్డెర విద్యార్థులకు వసతి కల్పించడంతో పాటు ఫంక్షన్ హాల్, దూర ప్రాంతం నుంచి వచ్చిన వారికి విశ్రాంత గదులు, గ్రంథాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య మాట్లాడుతూ వడ్డెరుల సంక్షేమం కోసం ట్రస్ట్ తరఫున కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ ఒర్సు కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు బండారు శ్రీరాములు, వెంకటకృష్ణ, ఎం.నర్సింహ్మ, గంజి సాయికృష్ణ, వరుకుప్ప లింగయ్య, అనంతరావు, ఎత్తరి మోహన్‌కుమార్, మల్లపు వెంకటేష్, నారాయణ, ఎత్తరి గణేష్, వల్లభు ఆశోక్, వంటిపులి శ్రీనివాస్, ముద్దంగుల చెన్నయ్య, సుధాకర్, గుండు స్వామి పాల్గొన్నారు.

ప్రమాద బీమా కార్డుల పంపిణీ



క్యాబ్‌డ్రైవర్లకు ప్రమాద బీమా కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: ట్యాక్సీ డ్రైవర్లకు చేయూత అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పథకాలకు రూపకల్పన చేస్తోందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో క్యాబ్ డ్రైవర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... క్యాబ్ డ్రైవర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా అందిస్తుందని, అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో పలువురు క్యాబ్ డ్రైవర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

భట్రాజు యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా కేశవ నాని



కేశవనానిని సన్మానిస్తున్న బాలరాజు తదితరులు

ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన కేశవనాని తెలంగాణ రాష్ట్ర భట్రాజు యువజన సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం ముషీరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో కేశవనాని విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయనకు సంఘం జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు బాలరాజు, ప్రధాన కార్యదర్శి వేణుమాధవ్ నియామక పత్రాన్ని అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా కేశవనాని మాట్లాడుతూ భట్రాజు కులస్తుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సంఘం సభ్యులకు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు బాలరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వేణుమాధవ్, కోశాధికారి భరద్వాజ్, ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, ఆనంద్, శ్రీకాంత్, నాయకులు శరత్, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం కోర్టుకు క్యూనెట్ బాధితులు



మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

కవాడిగూడ: క్యూనెట్ కంపెనీ మోసపూరిత కార్యక్రమాలను నిషేధించి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమ పెట్టుబడులను తిరిగి ఇప్పించాలని కోరుతూ క్యూనెట్ బాధితులు హైదరాబాద్ సిటీ క్రిమినల్ కోర్టును ఆశ్రయించనున్నట్లు క్యూనెట్ బాధితుల జేఏసీ కన్వీనర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్యూనెట్ బాధితులకు న్యాయవాది డాక్టర్ సాల్మన్ రాజు ఉచితంగా న్యాయ సేవలు అందించడం అభినందనీయమన్నారు. సుమారు 300 మంది క్యూనెట్ బాధితులు న్యాయం కోసం కోర్టుకు వెళ్లనున్నట్లు తెలిపారు. క్యూనెట్ కుంభకోణంపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు వేగంగా స్పందించి విచారణ జరిపి నిందితులను అరెస్టు చేయడం అభినందనీయమన్నారు. యాజమాన్యాన్ని సైతం అరెస్టు చేసి బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయాలని కోరారు. క్యూనెట్ బాధితులకు న్యాయం జరిగేంత వరకు ఉచితంగా న్యాయ సేవలను అందిస్తామని న్యాయవాది సాల్మన్ రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు మాథ్యూ, సుందర్, వేణు, ఆప్ నేతలు షరీఫ్, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



ప్రార్థన చేస్తున్న సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బౌద్ధ సంస్కృతి, సామాజిక–విద్యా పరిశోధన సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం వార్షిక సర్వ సభ్య సమావేశం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అంతకు ముందు ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత ఐఎఫ్‌ఎస్ అధికారి ఎస్‌ఎన్ జాదవ్ బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షుడిగా డాక్టర్ ఏ.ఎల్.కందారే, ప్రధాన కార్యదర్శిగా ఎం.జి.మోరే, ఉపాధ్యక్షులుగా డాక్టర్ డి.ఎం.బహదూరే, ఎం.కె.హవారే, కోశాధికారిగా ఆర్.సి.నిత్నావరే, సంయుక్త కార్యదర్శులుగా సోన్బాసాల్వే, ఎస్.ఎల్.ఇంగ్లే తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ విజయకుమార్ గవాయికర్, సీమా బహదూరే, మాధురి తక్సాందే, జ్యోతి గావై, అనితాదాంలే పాల్గొన్నారు.

భళా.. నృత్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నృత్యా నికేతన్ ప్రతిభారాజ్‌గౌడ్ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మహా గణపతిం, ముద్దుగారే యశోద, అదిగో అల్లదిగో, జానపద నృత్యం, పలుకే బంగారమాయే, దశావతారం, తరంగం, నీలమేఘ శరీర మొదలైన అంశాలను ప్రదర్శించారు. వైష్ణవి, వర్షిక, సహస్ర, ఈషా, సిద్ధికా, నిత్యశ్రీ, పావని, రాజ్ఞ తదితరుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

